క్లుప్తంగా

రాచపల్లిలో డ్రోన్ సర్వే

మాకవరపాలెం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా బుధవారం రాచపల్లిలో డ్రోన్ సర్వే చేశారు. ఈ సర్వే అనంతరం భూముల సర్వే ప్రారంభిస్తామని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. మండలంలో మొదటి విడతగా ఎనిమిది గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

23న ఆశీల వసూలు వేలం

మాకవరపాలెం: స్థానిక వారపు సంత ఆశీల వసూలుకు ఈ నెల 23న వేలం నిర్వహిస్తామని ఎంపీడీవో అరుణశ్రీ బుధవారం తెలిపారు. ప్రతి మంగళవారం ఇక్కడ సంతకు వచ్చే దుకాణదారుల నుంచి ఆశీలు వసూలు చేసేందుకు ఏటా వేలం నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో 23వ తేదీ 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వేలంలో పాల్గొనేవారు రూ.25 వేలు డీడీ, రూ. 4 లక్షల ష్యూరిటీ సొమ్ముతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి సీతారామ స్వామి బ్రహ్మోత్సవాలు

నర్సీపట్నం: మున్సిపాలిటీ కొత్తబయపురెడ్డిపాలెంలో సీతారామ స్వామివారి ఆలయంలో గురువారం నుంచి 18వ తేదీ వరకు పదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 17న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారికి కల్యాణోత్సవం(శ్రీనివాస కళ్యాణం) నిర్వహించనున్నామన్నారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా తలుపులమ్మ ఆలయ నిర్మాణం


చివరి దశలో నిర్మాణ పనులు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో తలుపులమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.20 లక్షలతో ఈ పనులను చేపడుతున్నట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తెలిపారు. ఆలయం ఎదుటి భాగంలో మండపం నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెలలో అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట మేజర్ పంచాయతీలో దోమల నివారణకు గానూ మలాథియాన్, ఫినాయిల్ మందును పిచికారీ చేపట్టారు. గ్రామంలో దోమలు విజృంభిస్తుండటంతో బుధవారం 1, 2, 3 వార్డుల్లో పిచికారీ చేశామని, గురువారం నుంచి అన్ని వార్డుల్లో చేయిస్తామని సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా తెలిపారు.

765 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


దిబ్బూరులో పశువులకు టీకాలు వేస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: మండలంలోని ఎం. కోడూరు, కింతలి వల్లాపురం, దిబ్బూరు, తదితర పది గ్రామాల్లో బుధవారం 765 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. ఇంత వరకు మండలంలో 7,850 పశువులకు టీకాలు వేశామన్నారు. పశు వైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

19న చిన్నారుల ఉచిత ఆధార్ శిబిరం

రావికమతం: టి.అర్జాపురం గ్రామ సచివాలయంలో ఈ నెల 19న చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేసే ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు నమోదు చేయడానికి చిన్నారి జన్మదిన ధ్రువీకరణ, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు తీసుకురావాలని నిర్వాహకుడు నాయుడు సూచించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601


రావికమతం: కొత్తకోట కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


దేవరాపల్లి: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


చోడవరం రూరల్: పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు


మాడుగుల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 311 మంది గైర్హాజరు
- సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ
- పటిష్టంగా పోలీస్ బందోబస్తు


బుచ్చెయ్యపేట: వడ్డాది కాలేజీ వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు

నర్సీపట్నం: ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యాశాఖాధికారులు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నర్సీపట్నంలోని ఏడు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. 3,400 మందికిగాను 180 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు ప్రశాంతంగా రాశారు. వీరికి సమస్యలు తలెత్తకుండా తాగునీరుతోపాటు ఫ్యాన్లు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేశారు.

చోడవరం రూరల్: పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాలకు 1,411 మందికిగాను 1,455 మంది విద్యార్థులు హాజరయ్యారు. 66 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజున జనరల్ ఫౌండేషన్ కోర్సులైన తెలుగు, హిందీ, సంస్కృతం భాషా పరీక్షలను నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి 470 మందికి గాను 437 మంది, 4ఎస్ కళాశాల కేంద్రానికి 477 మందికి 468 మంది ఉషోదయా కళాశాల కేంద్రానికి 574 మందికి 550 మంది హాజరయ్యారు. సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో గస్తీ కాశారు. అటు కళాశాలల యాజమాన్యాలు పరీక్ష నిర్వహణలో పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. తొలిరోజు పరీక్ష ఎలాంటి మాల్ ప్రాక్టీస్, ఇతర అవాంతరాలకు తావివ్వకుండా ప్రశాంతంగా ముగిసింది.

14 మంది హాజరు కాలేదు

మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలి రోజు ఇంటర్ పరీక్షకు 289 మంది విద్యార్థులకుగాను 275 మంది హాజరయ్యారు. 14 మంది హాజరు కాలేదని ప్రిన్సిపాల్ శిరీషారాణి తెలిపారు. ఏడు గదుల్లో సీసీ కెమెరాలు అమర్చారు. చోడవరం రూరల్ సీఐ తాతారావు పర్యవేక్షణలో ఎస్ఐ దామోదరనాయుడు సారథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

19 మంది..

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో తొలి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు తెలుగు, హిందీ, జీఎఫ్‌సీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 291 మంది విద్యార్థులకుగాను 272 మంది హాజరయ్యారు. వెరసి 19 మంది గైర్హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులు తమకు కేటాయించిన గదులను తెలుసుకునేందుకు ఆవరణలో ఏర్పాటు చేసిన బోర్డు వద్దకు పరుగులు తీయడం కనిపించింది. గురువారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 303 మంది విద్యార్థులు హాజరవుతారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ యు.వి.ఎస్. వర్మ తెలిపారు. ఎస్ఐ డి. నాగేంద్ర భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెనుగుపూడి డాక్టరు బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.

ఆరుగురు..

రావికమతం: కొత్తకోట జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షకు అర గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. ఇక్కడి కేంద్రంలో జనరల్ సబ్జెక్ట్‌కు సంబంధించి 159 మందికిగాను 156 మంది, ఒకేషనల్‌లో 60 మందికి గానూ 57 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 219 మందికిగాను ఆరుగురు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ సాయికుమార్ తెలిపారు. బెంచీలు, ఫ్యాన్, విద్యుత్, తాగునీరు, వైద్యం తదితర సదుపాయాలు కల్పించారు.



నర్సీపట్నం: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

26 మంది..

బుచ్చెయ్యపేట: వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు 229 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు 26 మంది హాజరు కాలేదు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 268 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రం వద్ద మంచినీటి వసతి, వైద్య సేవలు కల్పించారు.

8 మంది

గొలుగొండ: కృష్ణదేవిపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గొలుగొండ గురుకుల కళాశాల, కేజీబీవీ, కృష్ణదేవిపేట కళాశాల నుంచి 250 విద్యార్థులకు గాను మొదటిరోజు 242 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది హాజరు కాలేదని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధి పనుల రికార్డులను సిద్ధం చేయాలి

- డ్వామా క్లస్టర్ ఏపీడీ శ్రీనివాస్

దేవరాపల్లి: ఢిల్లీ నుంచి మినిస్టర్ ఆఫ్ రూరల్ డెవలెప్‌మెంట్(ఎంవోఆర్డీ) బృందం ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుందని, ఈ నేపథ్యంలో మూడేళ్లలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకోవాలని డ్వామా క్లస్టర్ ఏపీడీ బి. శ్రీనివాస్ ఆదేశించారు. చిననందిపల్లిలో అమృత్ సరోవర్‌లో స్కీమ్‌లో రూ.20 లక్షలతో చేపడుతున్న పరమ్మా చెరువు అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడి, ఎంత మేర కూలి గిట్టుబాటు అవుతుందని ఆరా తీశారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. కూలీలంతా పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కూలీకి సరాసరి రూ.257 కూలి గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్‌లో 90 రోజుల పనిదినాల మస్టర్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఏపీవో డి. చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈసీ కె. శ్రీనివాసరావు తదితర్లు పాల్గొన్నారు.


చిననందిపల్లిలో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాస్

వినియోగదారుల హక్కులపై అవగాహన

చోడవరం రూరల్: విద్యార్థి దశలో వినియోగదారుల హక్కులు, దానికి సంబంధించిన చట్టం పట్ల అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు సూచించారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా చోడవరం కన్స్యూమర్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ఏర్పాటు, హక్కుల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వస్తువుల కొనుగోళ్లకే గాకుండా వివిధ రకాల సేవలను పొందే విషయంలోనూ వినియోగదారుల హక్కుల చట్టం వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు. సీనియర్ ఉపన్యాసకులు రఫీయుద్దీన్, సత్యనారాయణ, రాధాకృష్ణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మాల్యాద్రి, లక్ష్మీ, పిచ్చమ్మ పాల్గొన్నారు.


విద్యార్థులకు వివరిస్తున్న ఉపన్యాసకులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

దేవరాపల్లి: ఉన్నత విద్యనభ్యసించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆదర్శ వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు బి. త్రినాథరాజు తెలిపారు. బుధవారం నాగయ్యపేటలో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వినియోగదారుల చట్టంపై వివరించారు.

సంపూర్ణ పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

చోడవరం: సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా నాలుగు గ్రామాలను కలుపుతూ బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చోడవరం నుంచి గోవాడ, అంబేరుపురం మీదుగా వెంకన్నపాలెం జంక్షన్ వరకూ ఆరు కిలోమీటర్ల మేర ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు మెయిన్ రోడ్డుపై ఇరుపక్కలా చెత్తాచెదారాలు, తుప్పలు తొలగించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్, చోడవరం పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రం చేయడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారు.


స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

ప్రతి సభ్యురాలి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

కె.కోటపాడు: డ్వాక్రా సంఘాల్లో ప్రతి సభ్యురాలు తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణంతో ఆర్థికాభివృద్ధి సాధించడం ముఖ్యమని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎ.ఎం.రాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లతో విజన్ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ రాజేశ్వరి మాట్లాడుతూ గమ్యం అనేది ఒక ఉమ్మడి లక్ష్యాన్ని, ఆశ, ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. ఈ లక్ష్యాన్ని ప్రతి డ్వాక్రా సంఘాల్లో సభ్యులు బ్యాంక్ లింకేజీ రుణాలతో ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర స్త్రీనిధి సహాయ సహకార సంఘం అధ్యక్షురాలు బి.జయలక్ష్మి, వెలుగు ఏపీఎం పి.వెంకటలక్ష్మి, తిలక్, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సీతంనాయుడు పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎంలు వెంకటలక్ష్మి, తిలక్

మైదాన గిరిజనులకు న్యాయం చేయాలి

నాతవరం: మైదాన ప్రాంతంలో గిరిజనులకు ఏజెన్సీ మాదిరిగానే అన్ని సదుపాయాలు కల్పించాలని నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు బండి గంగరాజు తెలిపారు. ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సుందరకోట పంచాయతీ శివారు అననగిరిలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా బండి గంగరాజు, సమతా కోఆర్డినేటర్లు కె.సతీష్‌కుమార్, సైమన్ మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు మైదాన గిరిజనులకు నేటికీ సక్రమంగా అందటం లేదని వాపోయారు. ఇక్కడ ఏజెన్సీ, మైదాన ప్రాంతాల విభజనతో మైదాన ప్రాంతంలో గిరిజన నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పునరాలోచించి మైదాన ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. గిరిజన గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.


అననగిరి గ్రామంలో గిరిజనుల నిరసన

ప్రజల మన్ననలు పొందేలా సేవలు

నాతవరం: ప్రజలు మన్ననలు పొందే విధంగా సచివాలయం ద్వారా సేవలందించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో డి.యర్రవరం, చమ్మచింత గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఇక్కడ అందిస్తున్న సేవలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ పనులపై వచ్చే ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పందన కార్యక్రమానికి వెళ్లే అవకాశముందన్నారు. సచివాలయ కార్యదర్శి రంజాన్ బేజీ, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న సభ్యులు

మాడుగుల రూరల్: ముకుందపురం గ్రామానికి చెందిన తెలగాన జగ్గారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆయనకు బుధవారం స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.10 వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మచ్చా వీర్రాజు, సభ్యులు పెంకి శివ, చంద్రశేఖర్, భోగేశ్వరావు, యువకులు పాల్గొన్నారు.

24న వారపు సంత ఆశీళ్ల వేలం

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట, రోలుగుంట వారపు సంతల ఆశీళ్ల వేలం పాటలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ప్రభాకరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను ఆశీలు వసూలుకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. రోలుగుంట వారపు సంతకు రూ. 25 వేలు, బుచ్చింపేట వారపు సంతకు రూ.15 వేలు ధరావత్తు సొమ్మును డీడీ రూపంలో చెల్లించాలన్నారు. తహసీల్దార్ హోదాకు తక్కువ కాని అధికారి నుంచి రూ.50 వేలు మోతుబారి(సాల్వెన్స్) ధ్రువపత్రం సమర్పించి ఈ పాటలో పాల్గొనాలన్నారు.

నేడు ఉత్తరాంధ్ర ఎడ్ల బళ్ల పరుగు పందెం

మాడుగుల రూరల్: ఖండివరం రహదారిలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం గురువారం నిర్వహించనున్నట్లు మరిడిమాంబ రైతు సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన, 2 గంటల నుంచి ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందేలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 12 బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

18న వాహనాలు వేలం

నర్సీపట్నం: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 33 వాహనాలను ఈ నెల 18న బహిరంగ వేలం వేయనున్నామని నర్సీపట్నం ఎస్ఈబీ స్టేషన్ సీఐ జి.శ్రీనివాసు తెలిపారు. ఎంవీఐ నిర్ధారించిన ధర నుంచి బహిరంగ వేలం వేస్తామన్నారు. ఇందులో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు బయానా కట్టాలన్నారు. వేలంలో వాహనాలు పొందలేని వారికి నగదు వాపసు చేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 8 గంటలకు ఎస్ఈబీ స్టేషన్‌కు రావాలన్నారు.

నిండుగొండలో పశు వైద్య శిబిరం

రోలుగుంట: నిండుగొండలో బుధవారం పశు వైద్య, గర్భకోశ శిబిరాన్ని నిర్వహించారు. కె.నాయుడుపాలెం, ఎస్.కొత్తూరు, నిండుగొండ గ్రామాల నుంచి వచ్చిన 200 పశువులకు రోలుగుంట, బుచ్చింపేట పశు వైద్యులు నూకేశ్వరరావు, అశ్విని పరీక్షలు చేశారు. 160 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. 18 దూడలకు పరాన్న జీవుల మందులను సర్పంచ్ శెట్టి సంధ్య, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణమూర్తితో కలిసి రైతులకు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ వెంకటరాజారావు పాల్గొన్నారు.


రైతుకు మందులు అందజేస్తున్న సర్పంచ్ సంధ్య, మాజీ ఎంపీపీ

మెయిన్ రోడ్డు విస్తరణ కోరుతూ నేడు ర్యాలీ

నర్సీపట్నం: ప్రజావసరాల దృష్ట్యా పట్టణ మెయిన్ రోడ్డును 120 అడుగుల మేర విస్తరించాలని కోరుతూ నర్సీపట్నం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ చేపడుతున్నారు. మైదాన, ఏజెన్సీ మండలాలకు నర్సీపట్నం ప్రధాన కూడలి గా ఉండటంతో మెయిన్ రోడ్డును వందడుగులు కాకుండా 120 అడుగుల మేర విస్తరించాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కె.చక్రవర్తి, ఎం. సతీష్, కె.ప్రసాద్ డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కరపత్రాలను పంచిపెట్టి, అన్ని వర్గాల వారు పాల్గొని మద్దతు తెలిపాలని కోరారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా నూకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

గొలుగొండ: డివిజన్ ప్రజల ఆరాధ్యదైవమైన లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయంలో బుధవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఏటా కొత్త అమావాస్య సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు, తీర్థం నిర్వహిస్తారు. గతేడాది దేవదాయ శాఖ నుంచి రూ. 26 లక్షలు మంజూరు కావడంతో నూతనంగా ఆలయ నిర్మించారు. తాజాగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్యపాలెంకు చెందిన సన్యాసమ్మ, కుమారుడు సాయి ఆలయానికి హుండీ వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బొందల నూకరత్నం, రాష్ట్ర శెట్టి బలిజ డైరెక్టర్ బొందలరాజు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ తోకల సంతోష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హుండీ వితరణగా అందిస్తున్న దాత

అమ్మవారి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

నర్సీపట్నం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ఇలవేల్పు నూకాలమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏటా కొత్త అమావాస్య జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే విధంగా ఈ ఏడాది అమ్మవారి జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. మంగళవారం రాత్రి అమ్మవారి మొదటి జాగారం, 17న రెండో జాగారం, 20న మూడో జాగారం, 21న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశామని, భక్తులకు తీర్థ ప్రసాదం అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు

చేపలు అమ్మడానికి వచ్చి సొమ్మసిల్లిన వృద్ధురాలు

- 104 సిబ్బంది సపర్యలు

రావికమతం: పూడిమడకకు చెందిన మింది అమ్మోరమ్మ(55) బుధవారం కొమిర గ్రామంలో సొమ్మసిల్లి పడిపోయింది. ఇదే గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న 104 సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించి అక్కడి నుంచి రావికమతం ఆస్పత్రికి తరలించారు. పూడిమడక గ్రామానికి చెందిన ఆమె ఎండు చేపలు విక్రయించేందుకు ప్రతి బుధవారం కొమిర, మత్స్యపురం గ్రామాలకు వస్తుంటోంది. ఎప్పటిలాగానే చేపలు విక్రయించడానికి ఎండలో తిరుగుతుండగా ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు గమనించారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న 104 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను రావికమతం నుంచి నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.


అమ్మోరమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న 104 సిబ్బంది

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com